సాక్షి ఖమ్మం

బుధవారం । 9 । ఆగస్టు । 2023



దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

గృహలక్ష్మి పథకం ద్వారా ఆర్థికసాయం కోసం దరఖాస్తులు స్వీకరణ మొదలవడంతో కార్యాలయాలకు ప్రజలు బారులుదీరారు. 8లో



'రహదారి'పై రాజకీయం

వైరా రిజర్వాయర్‌కు వెళ్లే రహదారి విస్తరణలో నిబంధనలు పాటించడం లేదని అఖిలపక్షం నాయకులు ఆందోళన నిర్వహించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 26°

జిల్లాలో బుధవారం ఉక్కపోత వాతావరణం ఉంటుంది. అంతటా సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

ఆటాడుకుందాం.. రా!

జిల్లా కేంద్రంలో 'అస్ట్రో టర్ఫ్' వికెట్, నెట్స్

- హైదరాబాద్‌లో తర్వాత ఖమ్మంలోనే...
- రూ.35లక్షల వ్యయంతో కొనసాగుతున్న పనులు

జిల్లా క్రికెట్ ప్రియులకు ఇది నిజంగా శుభవార్తే! హైదరాబాద్ తర్వాత తెలంగాణలో మరెక్కడా లేని విధంగా క్రికెట్ క్రీడాకారుల కోసం అత్యంత ఆధునికమైన అస్ట్రో టర్ఫ్ వికెట్, నెట్ జిల్లా కేంద్రంలో సిద్ధమవుతోంది. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో హెచ్‌సీఏ సౌజన్యంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన పనులు చకచకా సాగుతున్నాయి. రూ.35లక్షల వ్యయంతో టర్ఫ్ వికెట్, నెట్ అందుబాటులోకి వస్తే ఔత్సాహిక, వర్ధమాన క్రీడాకారులు ప్రాక్టీస్ చేయడం సులువు కానుంది. – ఖమ్మం స్పోర్ట్స్

జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలోని జిమ్నాస్టిక్స్ హాల్ పక్కన ఖాళీ స్థలంలో క్రికెట్ క్రీడాకారుల కోసం క్రికెట్ నెట్స్ ఏర్పాటుచేస్తున్నారు. ఇరువైపులా ప్రాక్టీస్ చేసేలా భారీ పోల్స్ ఏర్పాటు చేయడమే కాకుండా అత్యంత ఆధునికమైన నెట్స్ తీర్చిదిద్దుతున్నారు. మొదటి అంతస్తులో ప్రాక్టీస్ కోసం రంగం సిద్ధం చేస్తుండగా.. రెండో అంతస్తులో కార్యాలయం నిర్మించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో రూ.35లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతుండగా, ఈనెల 20వ తేదీ లోపు ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అలాగే, ఔత్సాహిక క్రికెటర్లు ప్రాక్టీస్ చేసేందుకు అత్యాధునిక బాల్ మిషన్ కూడా అందుబాటులోకి తీసుకొస్తారు. వీటికి తోడు కూర్చున్న భంగిమలో ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లి బొమ్మను కూడా ఏర్పాటుచేస్తారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేయిస్తున్న ఈ బొమ్మకు రూ.3లక్షలు వ్యయమవుతుండగా, స్టేడియంకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. జిల్లాకు తలమానికంగా నిలిచేలా క్రికెట్ నెట్స్ అందుబాటులోకి వస్తే ఔత్సాహిక, వర్ధమాన క్రికెటర్లు నిరంతరం ప్రాక్టీస్ చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని వెల్లడించారు.



క్రికెట్ నెట్, అస్ట్రోటర్ఫ్ వికెట్ నమూనా



నెట్స్ ఏర్పాటుకు జరుగుతున్న పనులు



క్రికెట్‌ను ప్రోత్సహించడమే లక్ష్యం

క్రికెట్‌పై ఆసక్తి ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో అస్ట్రో టర్ఫ్ క్రికెట్ నెట్స్ సిద్ధం చేస్తున్నాం. తెలంగాణ జిల్లాల్లో హైదరాబాద్ తర్వాత ఇక్కడే అత్యాధునికమైన నెట్ ఏర్పాటవుతోంది. ఔత్సాహిక, వర్ధమాన క్రికెటర్లకు ప్రాక్టీస్ చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. శిక్షణ కోసం కోచ్‌లను కూడా రప్పిస్తాం.

– ఎం.డీ.మసూద్‌పాషా, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్

న్యూస్‌రీల్

సీటీసీ ప్రిన్సిపాల్‌గా సుభాష్ చంద్రబోస్



ఖమ్మంక్రైం: పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సిటీ పోలీస్ ట్రెయినింగ్ సెంటర్(సీటీసీ) ప్రిన్సిపాల్‌గా ఏ.సుభాష్ చంద్రబోస్ నియమితులయ్యారు. ఈమేరకు ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా అదనపు డీసీపీ(శాంతి భద్రతలు)గా 2021 ఏప్రిల్ 6నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్న బోస్‌ను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు వారం క్రితం హైదరాబాద్‌లోని రాష్ట్ర కంట్రోల్ సెంటర్‌కు బదిలీ చేశారు. అయితే, ఎన్నికల ప్రధాన విధుల్లో కాకుండా ఇతర విధుల్లో జిల్లాలోనే కొనసాగించవచ్చన్న మినహాయింపు ఉండడంతో తిరిగి సుభాష్ చంద్రబోస్‌ను సీటీసీకి బదిలీ చేసినట్లు సమాచారం.

63 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంపులో 63 మంది సర్టిఫికెట్‌కు అర్హత సాధించారు. మొత్తం 131 మంది దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకోగా 103 మంది క్యాంపునకు హాజరయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 63మందిని సర్టిఫికెట్‌కు అర్హులుగా గుర్తించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పరిశీలన

కల్లూరు: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థికసాయంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఈమేరకు కల్లూరులోని యూనిట్లను డీఆర్‌డీఓ విద్యాచందన మంగళవారం పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీడీఓ బి రవికుమార్, సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం ఎం వెంకట్రామారావు, సీసీలు వెంకట్రావమ్మ, శ్యామలాదేవి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో కౌన్సెలింగ్‌కు సిద్ధం



కౌన్సెలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమైన ఉద్యోగులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్ల భర్తీకి నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లుచేశారు. మెడికల్ కళాశాలకు వంద సీట్లు కేటాయించగా, విద్యార్థులు వెబ్ ఆప్షన్లు పెట్టుకుంటున్నారు. అయితే, జాతీయ కోటాలో తొలి విడత రిజిస్ట్రేషన్లు జరగగా అందులో ఎవరు కూడా ఖమ్మం కళాశాలలో చేరలేదు. రెండో విడతలో ఇక్కడ చేరనుండడం, రాష్ట్ర స్థాయి కౌన్సెలింగ్ కోసం విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వనున్నారు. ఈనేపథ్యాన కళాశాలలో చేరేందుకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే విద్యార్థులకు ఇక్కడే కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈసందర్భంగా పాత కలెక్టరేట్ భవనం పైఅంతస్తులో హెల్ప్ డెస్క్ ఇతర ఏర్పాట్లు పూర్తిచేశారు. కాగా, వచ్చే అక్టోబర్‌లో తరగతులు మొదలు కానున్నాయని మెడికల్ కాలేజీ వెల్లడించారు.

జ్వరాల బెంగ..



జిల్లా పెద్దాస్పత్రిలోని ఓపీ కౌంటర్ వద్ద బారులు దీరిన ప్రజలు

- జిల్లాలో విషజ్వరాల ఉధృతి
- అక్కడక్కడా డెంగీ కేసులు కూడా..
- పెద్దాస్పత్రికి వస్తున్న వారితో ఓపీ కిటకిట
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో సీజనల్ వ్యాధుల కాలం వచ్చేసింది. ఇప్పుడిప్పుడే ప్రజలు విషజ్వరాల బారిన పడుతుండగా... జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గత నెలలో పది రోజుల పాటు వరుసగా కురిసిన వర్షాలతో పరిస్థితుల్లో మార్పు వచ్చింది. వర్షపు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల డెంగీ కేసులు కూడా నమోదవుతుండగా.. అధికారులు తీసుకుంటున్న చర్యలతో పెద్దగా ఫలి తం ఉండడంలేదు. కాగా, జ్వరాల బారిన పడిన వారు ఎక్కువగా జిల్లా పెద్దాస్పత్రి బాట పడుతుండడంతో కిటకిటలాడుతోంది. సాధారణ రోగులతో పాటు జ్వరపీడితులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. అంత ప్రమాదకరమైన పరిస్థితులు లేకపోవడంతో ఆస్పత్రిలో చేరకుండా పరీక్షలు చేయించుకుని మందులు తీసుకెళ్తున్నారు.



వైద్యుల కన్సల్టేషన్ గదుల వద్ద జనం

పెరిగిన ఓపీ సేవలు

ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో సాధారణ రోజుల్లో వెయ్యి మంది లోపు ఔట్ పేషంట్ విభాగంలో పరీక్షలకు వస్తారు. అయితే, గత పది రోజులుగా 1,300 మందికిపైగా వస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. సాధారణ రోగులతో పాటు జ్వరపీడితులు కూడా వస్తుండటంతో ఓపీ పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఇక మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి గర్భిణులకు తోడు విషజ్వరాల బారిన పడ్డ మహిళలు కూడా వస్తున్నారు. ఫలితంగా ఎంసీహెచ్‌లో సాధారణంగా ఓపీ 300 లోపు ఉంటే ఇప్పుడు 500 దాటుతోంది.

పెరుగుతున్న విషజ్వరాలు

గతనెల చివరలో పది రోజుల పాటు కురిసిన వర్షాలతో గ్రామ స్థాయి నుండి పట్టణ, నగర స్థాయి వరకు పారిశుద్ధ్యం పడకేసింది. వర్షపునీటితో పాటు మురుగు వీధుల్లో పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. గత రెండు నెలల్లో చూస్తే జూన్‌లో 4,500 మంది విషజ్వరాల బారినపడగా, జూలైలో కూడా 4,300 మందికి పైగా జ్వరం బారిన పడ్డారు. అలాగే, ఈ ఏడాది 25 డెంగీ పాజిటీవ్ కేసులు నమోదు కాగా జూన్‌లో ఏడు, జూలైలో 18 కేసులు దాటాయి. కాగా, డెంగీ ప్రభావం ఇప్పుడిప్పుడే చూపిస్తుండగా విషజ్వరాల తాకిడి మాత్రం ఎక్కువగానే ఉంది.

పెద్దాస్పత్రిలో ఈ ఏడాది ఓపీ, ఐపీ వివరాలు

నెల	ఓపీ	ఐపీ
జనవరి	40,799	5,075
ఫిబ్రవరి	41,481	4,667
మార్చి	43,341	5,120
ఏప్రిల్	37,219	4,973
మే	37,471	5,444
జూన్	38,206	5,352
జూలై	39,339	4,242
ఆగస్టు (7వ తేదీ వరకు)	9,664	1,343

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూస్తేనే ఫలితం ఉంటుంది. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలి. శాఖ తరఫున మురికి కాల్వల్లో ఆయిల్ బాల్స్, నిల్వ ఉన్న నీటిలో గంబూషియా చేపలు వదులుతున్నాము. ఫాగింగ్ కూడా జరుగుతోంది. ఎక్కడైనా కేసులు నమోదైతే ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతానికి జిల్లాలో పరిస్థితి అదుపులోనే ఉంది.

– బి.మాలతి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, పక్కన నాగేశ్వరరావు, నాయకులు

- పాత వారితో పాటు తనకూ పోగులు ఇస్తే చాలు..
- కాంగ్రెస్ ప్రచార కమిటీ కోకన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని.. ఏదిఏమైనా రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ప్రచార కమిటీ కోకన్వీనర్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని సత్యనారాయణపురంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో జరిగిన రాహుల్‌గాంధీ సభకు అధికార పార్టీ నాయకులు అడ్డంకులు సృష్టించినా లక్షలాదిగా ప్రజలు తరలిరావడంతోనే కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంత ప్రేమ ఉందో అర్థమైందన్నారు. కాగా, ఏపీలో నష్టం జరుగుతుందని తెలిసి కూడా తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. గత తొమ్మిదిన్నరేళ్లుగా కేసీఆర్‌ను ఎప్పుడు ఇంటికి పంపిద్దామా అని ప్రజలు ఎదురుచూస్తున్నందున.. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నేతల మాయమాటలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసే రుణమాఫీ, ఆర్టీసీ ఉద్యోగుల విలీనానికి తెరలేపారని ఎద్దేవా చేశారు. ఎన్ని కష్టాలు వచ్చినా అందరం కలిసి పనిచేద్దామని... ఐదు పోగులు వేస్తే అందులో పాత వారు మూడు తీసుకుని తనకు, తనను నమ్ముకున్న వారికి రెండు పోగులు ఇస్తే చాలని పొంగులేటి చెప్పారు. అనంతరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసమావేశంలో పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, తుళ్లూరి బ్రహ్మయ్య, చావా శివరామకృష్ణ, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, బొర్రా రాజశేఖర్, నరేష్‌రెడ్డి, మాధవీరెడ్డి, భైరు హరినాథబాబు, మద్ది శ్రీనివాసరెడ్డి, అశోక్‌నాయక్, కన్నేటి వెంకన్న, కళ్లెం వెంకటరెడ్డి, కొప్పుల అశోక్, శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి 'మేరీ మిట్టీ.. మేరా దేశ్'

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలోని ప్రతీ గ్రామపంచాయితీలో ఈనెల 9నుంచి 15వ తేదీ వరకు 'మేరీ మిట్టీ.. మేరా దేశ్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి చింతల అన్వేష్ తెలిపారు. ఈమేరకు దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ శిలాఫలకాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అలాగే, జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రతిజ్ఞ చేయాలని, గ్రామాల్లో సేకరించిన మట్టిని మండల కార్యాలయాల్లో అందజేయాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

పాఠశాలలో సెల్‌ఫోన్ వాడితే సస్పెన్షన్



నేలకొండపల్లి/ముదిగొండ: పాఠశాల విధుల్లో ఉన్నప్పుడు ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడితే సస్పెండ్ చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ హెచ్చరించారు. నేలకొండపల్లి, ముదిగొండలో జరుగుతున్న తొలిమెట్టు శిక్షణను మంగళవారం పరిశీలించాక ఆయన మాట్లాడా రు. విధినిర్వహణ సమయంలో సెల్‌ఫోన్ వాడినట్లు తెలిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈమేరకు ప్రతీ ఉపాధ్యాయుడు తాను సెల్‌ఫోన్ వాడటం లేదని నోటీసు బోర్డులో లేఖ అంటించాలని సూచించారు. అనంతరం సింగారెడ్డిపాలెం పాఠశాలకు దాతలు అందించిన స్మార్ట్ టీవీలను డీఈఓ ప్రారంభించారు. ఎంఈఓ బి.రాములు, హెచ్ఎంలు హరి శ్రీనివా స్, రామ్మోహన్, వెంకట్రామిరెడ్డితోపాటు నాజర్, వేణు, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ, అదనపు కలెక్టర్ అభిలాష, మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత తదితరులు

- పార్టీలతో సంబంధం లేకుండా సమన్యాయం
- ప్రతీనెల 300 మంది బీసీలకు ఆర్థిక సాయం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఏ ప్రభుత్వం అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని.. తద్వారా ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన కుల వృత్తిదారులకు మంజూరైన రూ.లక్ష ఆర్థిక చెక్కులను మంత్రి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ రాష్ట్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతు బీమా, రైతుబంధు తదితర పథకాలను అమలుచేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. పార్టీలు, కులమతాలు చూడకుండా పథకాలు అమలుచేస్తున్న కేసీఆర్ మూడోసారి కూడా ముఖ్యమంత్రి అయితేనే ఈ పథకాలు కొనసాగుతాయని తెలిపారు.

జిల్లాలో 14,808 మంది అర్హులు

బీసీల్లో కుల, చేతివృత్తిదారులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, నియోజకవర్గానికి 300 మందికి చొప్పున ప్రతీ నెలా పంపిణీ చేయనున్నామని మంత్రి అజయ్ తెలిపారు. జిల్లాలో అర్హులైన వారు 14,808 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించగా, ఆర్థికసాయంతో కులవృత్తుల అభివృద్ధికి పాటుపడాలని లబ్ధిదారులను కోరారు. కాగా, నిరుపేదలు సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు గృహలక్ష్మి ద్వారా రూ.3లక్షల ఆర్థికసాయం చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3వేల మందికి ఈ నగదు అందజేయనుండగా, 1,100 మంది లబ్ధిదారులకు దళిత బంధు అమలుచేయనున్నట్లు వివరించారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ చేతి వృత్తులపై ఆధారపడే ప్రతీ బీసీ కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం రూ.లక్ష సాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతితో పాటు ఆఫ్రిఫ్, గుండాల కృష్ణ, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాల సాధనే లక్ష్యం

- ఇందుకోసమే మళ్లీ పోటీ చేస్తా
- మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల

నేలకొండపల్లి: గోదావరి జలాలను పాలేరుకు తీసుకరావడమే తన లక్ష్యమని రాష్ట్ర మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మండల కేంద్రంలో రామచంద్రాపురం సొసైటీ చైర్మన్ గూడవల్లి రాంబ్రహ్మం ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో పది లక్షల ఎకరాలకు నీరు అందించేలా సీతారామ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే జిల్లా భవితవ్యం మారిపోతుందని పేర్కొన్నారు. నాడు పాలేరులో అందరూ అభివృద్ధి చెందాలని సీఎం కేసీఆర్ తనను పోటీ చేయించారని, ప్రజల వినతి మేరకు పాలేరు పాత కాల్వ లైనింగ్ నిర్మాణం, రహదారుల సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం పాలేరు అత్యంత ఖరీదైన నియోజకవర్గంగా మారిందని తుమ్మల చెప్పారు. సీఎం కేసీఆర్ మాట నిలబెట్టేలా ప్రాజెక్టులు పూర్తిచేసి గోదావరి జలాలను పాలేరుకు తీసుకొచ్చి తన రాజకీయ శాశ్వత లక్ష్యం నెరవేర్చేందుకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా, ఆత్మీయ సమ్మేళనంలో రాజకీయాలకతీతంగా నాయకులు హాజరై తుమ్మల పోటీకి దిగితే ఆయనతోనే నడుస్తామని మద్దతు ప్రకటించారు.

విద్యార్థి కుటుంబానికి పరామర్శ

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో విద్యుదాఘాతంతో ఇటీవల మృతి చెందిన విద్యార్థి హలావత్ దుర్గా నాగేందర్ కుటుంబసభ్యులను మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఈకార్యక్రమాల్లో నాయకులు సాదు రమేష్‌రెడ్డి, శాఖమూరి రమేష్, వెనికె జానకీరామయ్య, వెన్నపూసల సీతారాములు, మైసా శంకర్, నల్లాని మల్లికార్జున్, కడియాల శ్రీనివాస్, ముత్తినేని వీరయ్య, పెద్ద వెంకయ్య, కడియాల నరేష్, పావులూరి వెంకటేశ్వరరావు, కొమ్మూరి నరేష్, జూకూరి గోపాలరావు, రామసహాయం వెంకటరెడ్డి, ఎడవెల్లి ముత్తయ్య, మాదాసు ఉపేందర్,, జొన్నలగడ్డ రవికుమార్, రేల వెంకటరెడ్డి, దామోదర్‌రెడ్డి, బారి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో తప్పులకు తావివ్వొద్దు

ఉద్యోగుల శిక్షణలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు ఎలాంటి తప్పులకు తావివ్వొద్దని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ సమావేశ మందిరంలో ఏఈఓలు, సీసీఎల్ఏ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మంగళవారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న పొరపాటు జరిగినా మొత్తం ప్రక్రియపై ప్రభావం పడుతుందన్నారు. జిల్లాలో 1,459 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటి సంఖ్య ఇంకొంత పెరిగే అవకాశముందని తెలిపారు. అలాగే, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 750 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇంకా ఈకార్యక్రమంలో సీపీఓ శ్రీనివాస్, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరాం, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరితతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



వ్యాపారి నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్

ఎక్సైజ్ స్టేషన్‌లో పరిశీలన

ఖమ్మంక్రైం: జిల్లాలో వైన్స్ కేటాయింపునకు దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుండగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్–1ను కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సహాయక కేంద్రం, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కాగా, వైన్స్ కోసం మంగళవారం నాటికి 51 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో అధికారుల బదిలీలు

జిల్లా డీసీగా హనుమాండ్లు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా వాణిజ్య పన్నుల శాఖ(రాష్ట్ర వస్తు సేవా పన్నుల జిల్లా విభాగం)లో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు జిల్లా వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ బాలాజీని మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈ స్థానంలో హైదరాబాద్ డీఆర్‌సీటీఓలో పనిచేస్తున్న సీహెచ్.హనుమాండ్లును నియమించారు. ఇంకా జిల్లాలో ముగ్గురు కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ల(సీటీఓ)ను కూడా బదిలీ చేశారు. ఖమ్మం సీటీఓ–1 బద్యానాయక్‌ను హైదరాబాద్ జిల్లా బర్కత్‌పుర సీటీఓగా, సీటీఓ–2 దశరథ్‌ను హైదరాబాద్ జిల్లా ఆగాపుర సీటీఓగా, సీటీఓ–3 సుబ్రమణ్యంను హైదరాబాద్ జిల్లా బేగంపేట సీటీఓగా బదిలీ చేశారు. అలాగే, సీటీఓ–2గా నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న ధనలక్ష్మిని నియమించగా మిగతా స్థానాలకు ఎవరినీ కేటాయించలేదు. ఆయా స్థానాలను కూడా రెండు రోజుల్లో పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నట్లు సమాచారం.



డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన హనుమాండ్లు

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



కేసీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్, ఎమ్మెల్సీ మధు

వైరా: ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్‌ను మంగళవారం రాత్రి హైదరాబాద్ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ కలిశారు. ఈ సందర్భంగా వైరాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని వారు సీఎంకు వినతిపత్రం అందజేశారు. దీంతో సీఎం సానుకూలంగా స్పందించి మంజూరుకు ప్రకటన చేశారని తెలిపారు.

జావెలిన్ త్రో పోటీల్లో మొదటిస్థానం



నవ్యశ్రీతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన హనుమకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జావెలిన్ త్రో విభాగంలో ఖమ్మం హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి దాసరి నవ్యశ్రీ సత్తా చాటింది. అండర్ –18 బాలికల విభాగంలో పాల్గొని ఆమె 18.29 మీటర్ల మేర జావెలిన్ త్రో విసిరి రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతికి దక్కించుకుంది. ఈ సందర్భంగా నవ్యశ్రీని పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి అభినందించారు.

న్యాయవాదులకు క్రీడాపోటీలు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళా న్యాయవాదులు

ఖమ్మంలీగల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం కోర్టు న్యాయవాదులకు మంగళవారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెస్ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ ప్రారంభించారు. అలాగే, మహిళలకు కబడ్డీ, వాలీబాల్, షటిల్ పోటీలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ క్రీడల కార్యదర్శి రావుల వెంకట్ ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహించగా, న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మరణాలను నమోదు చేయాలి

ఖమ్మంలీగల్: వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాల్లో జరిగే సహజ మరణాలను సైతం సంబంధిత అధికారుల వద్ద నమోదు చేయించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని మదర్ థెరిస్సా ఆశ్రమాన్ని మంగళవారం సందర్శించిన ఆయన నిర్వహణ తీరుపై ఆరా తీశారు. గత నెలలో ముగ్గురు వృద్ధులు మరణించారని నిర్వాహకులు చెప్పగా, ఎప్పటికప్పుడు జిల్లా సంక్షేమాధికారికి వివరాలు ఇవ్వాలని చెప్పారు.

భూపంపకాల విషయంలో ఘర్షణ

- కుమారులకు సర్దిచెప్పే క్రమంలో తండ్రిపై దాడి, మృతి

కామేపల్లి(కారేపల్లి): భూపంపకాల విషయంలో తండ్రిపై కుమారుడు దాడి చేయగా తీవ్రంగా గాయపడిన ఆయన మృతి చెందాడు. సోమవారం రాత్రి ఈ ఘటన జరగగా నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు సింగరేణి సీఐ బి.తిరుపతిరెడ్డి వెల్లడించారు. కామేపల్లి మండలం గోవింద్రాలకు చెందిన అన్నదమ్ములైన లకావత్ నాగేశ్వరరావు, లకావత్ రమేష్ నడుమ 15 గుంటల భూమి పంపకంపై సోమవారం గొడవ జరిగింది. ఈమేరకు వీరి తండ్రి లకావత్ సక్రు(69) సర్దిచెబుతుండగా పెద్ద కుమారుడు నాగేశ్వరరావు సక్రుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఆయన మృతి చెందాడు. ఈమేరకు నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈసమావేశంలో కామేపల్లి ఎస్ఐ పి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో పేకాట స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది మందిని అరెస్ట్ చేసి రూ.1.06లక్షల నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ వెంకటకృష్ణ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,091

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

- 'గృహలక్ష్మి' కోసం కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు
- జాతరలా వస్తున్న దరఖాస్తుదారులు



ఖమ్మం అర్బన్: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శైలజ

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం/ఖమ్మం మయూరిసెంటర్: సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకునే స్తోమత లేనివారికి రాష్ట్రప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షల ఆర్థికసాయం అందించనున్నట్లు ప్రకటించింది. అయితే, దరఖాస్తులు గురువారం వరకే స్వీకరిస్తామని వెల్లడించింది. దీంతో తొలిరోజైన మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంతో పాటు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఈమేరకు ప్రజలు బారులుదీరి దరఖాస్తులు సమర్పించారు. ఖమ్మం అర్బన్ తహసీల్‌లో రెండు బాక్స్‌లు, రఘునాథపాలెం తహసీల్లో ఒక బాక్స్ ఏర్పాటుచేసి సిబ్బందిని నియమించారు. కాగా, ఖమ్మం అర్బన్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను తహసీల్దార్ మేదరమెట్ల శైలజ ప్రారంభించారు.

- **నేలకొండపల్లి:** గృహలక్ష్మి పథకం కోసం తొలిరోజై దరఖాస్తులు వెల్లువెత్తాయి. నేలకొండపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌లో పెద్దసంఖ్యలో ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కాగా, అన్ని ధృవీకరణ పత్రాలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతున్నందున గడువు మరింత పొడిగించాలని పలువురు కోరారు.



రఘునాథపాలెం: తహసీల్‌లోని బాక్స్‌లో దరఖాస్తులు వేస్తున్న ప్రజలు

- **సత్తుపల్లి:** సత్తుపల్లిలోని తహసీల్, మున్సిపల్ కార్యాలయానికి ప్రజలు క్యూకట్టారు. మండలంలోని 21 పంచాయతీలు, పట్టణ పరిధిలోని 23 వార్డులకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో దరఖాస్తులు సమర్పించారు. తొలిరోజు మండలంలో 787 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు.
- **తల్లాడ:** తల్లాడ తహసీల్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి బాక్స్‌లు సమకూర్చగా 27గ్రామ పంచాయతీల నుంచి పేదలు దరఖాస్తులు సమర్పించారు. ఈమేరకు తహసీల్దార్ రవికుమార్ పర్యవేక్షించారు.
- **బోనకల్:** మండల కేంద్రంలోని తహసీల్‌లో 583 దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ పున్నం చందర్ తెలిపారు.



నేలకొండపల్లి: బాక్స్‌లో దరఖాస్తులు వేస్తున్న మండల వాసులు



సత్తుపల్లి: తహసీల్‌లో దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు



తల్లాడ: గృహలక్ష్మి దరఖాస్తులు సమర్పిస్తున్న ప్రజలు

రిజర్వాయర్ 'రహదారి'పై రాజకీయం

- దుకాణాల తొలగింపులో ఇష్టారాజ్యం?
- ఆత్మహత్యకు యత్నించిన ఓ షాపు యజమాని



ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వ్యాపారి ఉపేందర్



మున్సిపాలిటీ ఎదుట ఆందోళనకు దిగిన నాయకులు

వైరా: వైరాలోని క్రాస్ రోడ్డు నుండి రిజర్వాయర్ వరకు వెళ్లే రహదారి అభివృద్ధి పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. రహదారి అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు 'సుడా' నుంచి నిధులు మంజూరు కావడంతో అధికారులు పనులు ప్రారంభించారు. ఈమేరకు ఇరువైపులా కొందరు వ్యాపారుల దుకాణాలను రెండు రోజుల క్రితం నోటీసులు ఇవ్వకుండానే తొలగించారు. ఇక మంగళవారం కూడా దుకాణాలు తొలగిస్తుండడంతో అఖిలపక్షం ఆధ్వర్యాన నాయకులు రింగ్ రోడ్డు సెంటర్‌లో రాస్తారోకో చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 100 అడుగుల మేర రోడ్డు వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు నాయకులకు పోలీసులు సర్దిచెప్పి మున్సిపల్ కార్యాలయం వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాటట్లాడుతూ రహదారిని విస్తరించడంలో భాగంగా రెండు వైపులా ఆక్రమణలు తొలగించాలే తప్ప ఒకేవైపు తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం కమిషనర్ పతాని వెంకటేశ్వర్లును ఆయన చాంబర్‌లో ఘెరావ్ చేశారు.

ఒక వైపే నిర్మాణాల తొలగింపు

వైరా రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఆనుకుని మున్సిపల్ పాలకవర్గం రెండో స్థానంలో ఉన్న నేతకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. దీంతో ఆయన తన కాంప్లెక్స్ వైపు కాకుండా ఎదురుగా ఉన్న అద్దె భవనంలో నడుపుతున్న చేపల వ్యాపారులను తొలగించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈమేరకు నిరసనలో పాల్గొన్న చిరువ్యాపారుల్లో కట్ల ఉపేందర్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించగా అప్రమత్తమైన పోలీసులు, అఖిలపక్షం నాయకులు అడ్డుకున్నారు. కాగా, రహదారి అభివృద్ధి పనుల్లో అధికారుల తీరును కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇకనైనా పూర్తిస్థాయిలో సర్వే చేయించి విస్తరించాలని పలువురు కోరారు. కాగా, అఖిలపక్షం ఆధ్వర్యాన జరిగిన ధర్నాలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వివిధ పార్టీల నాయకులు కట్ల రంగారావు, బొంతు రాంబాబు, చెరుకూరి చలపతిరావు, ఏదునూరి సీతారాములు, యామాల గోపాలరావు, కట్ల సంతోష్, పణితి వెంకటేశ్వర్లు, పి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకం

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం వైరా నియోజకవర్గ సెక్టార్ అధికారులకు ఎన్నికల నిర్వహణ రెండో విడత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. డీఆర్‌డీఓ విద్యాచందన, మాస్టర్ ట్రెయినర్ మదన్‌గోపాల్ పాల్గొన్నారు.

సెలవులో డీసీఎస్‌ఓ

ఖమ్మం సహకారనగర్: జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి(డీసీఎస్‌ఓ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పద్మజ వ్యక్తిగత సెలవులో వెళ్లారు. హైదరాబాద్ నుంచి ఆమె ఖమ్మంకు బదిలీపై రాగా.. తొలుత విధుల్లో చేరేందుకు ఆసక్తి చూపలేదు. చివరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించినా, మళ్లీ సెలవులో వెళ్లడం గమనార్హం.

నర్సరీల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

రాష్ట్ర ఉద్యాన శాఖ డీడీ భాగ్యలక్ష్మి



కూసుమంచిలో నర్సరీని పరిశీలిస్తున్న డీడీ భాగ్యలక్ష్మి, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఉద్యాన పంటల నర్సరీల యజమానులు నిబంధనలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ పీవీ.భాగ్యలక్ష్మి సూచించారు. జిల్లాకు మంగళవారం వచ్చిన ఆమె జిల్లా ఉద్యాన అధికారి జి.అనసూయతో కలిసి పలు నర్సరీలను తనిఖీ చేశాక ఖమ్మంలోని శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ నర్సరీల నిర్వహణ, కల్తీరహిత నారు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే, కల్తీనారు పెంచే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. నర్సరీల్లో ఉన్న వెదురు మొక్కలను బ్లాక్ ప్లాంటేషన్‌గా, గట్లపై నాటుకునేందుకు ఉచితంగా రైతులకు అందించాలని తెలిపారు. తొలుత జిల్లాలోని కూసుమంచి మండలం చేగొమ్మ, కేశవాపురం, ధర్మాతండాల్లో మిరప, మామిడి నర్సరీలను డీడీ, అధికారులు తనిఖీ చేశారు.

మోసం చేసేందుకే 'గృహలక్ష్మి'

తిరుమలాయపాలెం: అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామనే హామీని విస్మరించిన రాష్ట్రప్రభుత్వం మరోమారు ప్రజలను మోసం చేసేందుకు గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని రఘునాథపాలెంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నికలు వస్తుండడంతో గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. దరఖాస్తుకు మూడు రోజుల గడువే ఇవ్వడం ఇందుకు నిదర్శమని తెలిపారు. ఈ నాయకులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, గుండా శ్రీనివాసరెడ్డి, బొడ్డుపల్లి ప్రసాద్, భద్రం, రవి, చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



రామారావును సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: రానున్న ఎన్నికల్లో అందరి సహకారంతో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్(ఎల్‌డీఎం) ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సూరంపల్లి రామారావు వెల్లడించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో అందరూ క్రియాశీలకంగా పనిచేసేలా కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, ఎడవల్లి కృష్ణ మాట్లాడగా, రామారావును సన్మానించారు. నాయకులు నాగండ్ల దీపక్‌చౌదరి, ముస్తఫా, కట్ల రంగారావు, మద్ది శ్రీనివాసరెడ్డి, రామసహాయం మాధవీరెడ్డి, రామ్మూర్తినాయక్, మిక్కిలినేని నరేందర్, దుంపటి నగేష్ పాల్గొన్నారు.

భూమి రిజిస్ట్రేషన్ కోసం విదేశాల నుంచి...

- తహసీల్దార్ లేకపోవడంతో ఆలస్యం

నేలకొండపల్లి: వారసత్వంగా వచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు విదేశాల నుంచి వచ్చిన మహిళ ఒకరు ఇక్కడ తహసీల్దార్ లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వచ్చింది. మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన టి.శైలజ అమెరికాలో ఉంటుండగా, ఆమెకు వారసత్వంగా వచ్చిన ఎకరం భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఈనెల 3వ తేదీన స్లాట్ బుక్ చేసుకున్నారు. ఇందుకోసం ఆమె రూ.3లక్షలు వెచ్చించి అమెరికా నుంచి స్వస్థలానికి వచ్చారు. అయితే, నేలకొండపల్లి తహసీల్దార్ దారా ప్రసాద్ ఈనెల 2న భద్రాద్రి జిల్లాకు బదిలీ కాగా, హనుమకొండకు చెందిన డి.మంజులను నియమించారు. కానీ ఆమె మంగళవారం(8వ తేదీ) వరకు కూడా విధుల్లో చేరకపోవడంతో శైలజ రిజిస్ట్రేషన్ జరగలేదు. కానీ ఆమె తిరుగు ప్రయాణానికి 10వ తేదీన టికెట్ బుక్ చేసుకోవడం, మళ్లీ టికెట్ కొనుగోలు చేయాలంటే రూ.1.50లక్షల వరకు వ్యయం కానుండడంతో కలెక్టర్ గౌతమ్‌ను ఆశ్రయించారు. దీంతో స్పందించిన ఆయన డిప్యూటీ తహసీల్దార్‌కు డిజిటల్ కీ ఇచ్చి బుధవారం రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలని ఆదేశించడంతో ఎన్ఆర్ఐ సమస్యకు పరిష్కారం లభించింది.

అదనపు కలెక్టర్‌ను కలిసిన పెట్రోలియం డీలర్లు



అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీలర్లు

ఖమ్మం సహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌ను జిల్లా పెట్రోలియం డీలర్ల అసోసియేషన్ బాధ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను సన్మానించి పలు అంశాలపై చర్చించారు. అసోసియేషన్ బాధ్యులు రాయపుడి పవన్, రవికుమార్, మాగంటి ప్రసాద్, ఈశ్వరప్రగడ రంగనాథ్, గోళ్ల జనార్ధన్, శ్రీనివాస్, కీమానాయక్, పిచ్చయ్య, రామ్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లుల్లో తనిఖీ

తల్లాడ: తల్లాడలో రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఎంఆర్ సేకరణపై ఆరా తీసిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. డీఎం సోములు, అసిస్టెంట్ మేనేజర్ నర్సింహారావు పాల్గొన్నారు.

సేవాలోపంపై ఇన్సూరెన్స్ కంపెనీకి జరిమానా

ఖమ్మంలీగల్: సేవాలోపం విషయంలో ఫిర్యాదుదారుడికి ఆస్పత్రి బిల్లులు, నష్టపరిహారంతో పాటు ఇతర ఖర్చులు చెల్లించాలని ఖమ్మం వినియోగదారుల ఫోరం సభ్యురాలు ఎ.మాధవీలత మంగళవారం తీర్పుచెప్పారు. తల్లాడ మండలం మల్లవరానికి చెందిన రైతు దుగ్గిదేవర వెంకటలాల్ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు. ఆతర్వాత ఆయన కోవిడ్ చికిత్సకు ఆస్పత్రిలో చేరి రూ.54,963 బిల్లు చెల్లించాడు. ఆతర్వాత స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బాధ్యులను ఖర్చులు చెల్లించాలని కోరగా నిరాకరించారు. దీంతో ఆయన జిల్లా వినియోగదారుల కమిషన్‌లో 2022 జనవరి 28న ఫిర్యాదు చేయగా, పరిశీలించిన ఫోరం ప్రతినిధులు సేవాలోపం జరిగిందని నిర్ధారించారు. ఈమేరకు ఆస్పత్రి ఖర్చుల కింద రూ.53,707తో పాటు నష్టపరిహారం రూ.15వేలు, లిటిగేషన్ ఖర్చుల కింద రూ.5వేలు చెల్లించాలని తీర్పు వెలువరించారు. ఫిర్యాదుదారుడి తరఫున ఇమ్మడి లక్ష్మీనారాయణ, సింగం జనార్దన్ వాదించారు.

నిర్బంధం.. హక్కులను హరించడమే



కలెక్టరేట్ వద్ద నాయకులు, విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాడే విద్యార్థి సంఘాలపై నిర్బంధం విధించడమంటే విద్యార్థి హక్కులను హరించడమేనని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థి సంఘాలను అనుమతించకుండా జారీ అయిన ఆదేశాలను నిరసించడంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ పోస్టులు భర్తీ చేసి మధ్యాహ్న భోజన పథకం అమలుచేయాలని, ఫీజు బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్లతో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ పాలకులు పౌర హక్కులకు భంగం కలిగిస్తున్నారని విమర్శించారు. నాయకులు వెళ్తే సమస్యలు బయటపడతాయనే భయంతోనే ప్రవేశాలను నిషేధించారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడుపల్లి లక్ష్మణ్, నాగుల్‌మీరా, శివ, ఉజ్వల్, మల్సూర్, నరేష్, వెంకటేష్, గోపి, సాయి, నరేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం శుభ్రం చేస్తూ కింద పడి మృతి



రత్నకుమార్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: పాఠశాల భవనంపై ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిన వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కిష్టాపురానికి చెందిన బొబ్బిలి రత్నకుమార్ (42) బేతుపల్లి ప్రాథమిక పాఠశాలలో రోజువారీ పనిచేసేందుకు మంగళవారం వచ్చాడు. ఈక్రమంలో పాఠశాల భవనం పైన పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో వెంటనే ఉద్యోగులు సీపీఆర్ చేశారు. అంతలోనే 108 వాహనం రాగా సిబ్బంది పరిశీలించి రత్నకుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య జ్యోతి, ఒక కుమారుడు, కుమార్తె ఉండగా.. రత్నకుమార్ మృతిపై సందేహాలున్నాయని భార్య చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనాస్థలాన్ని ఏసీపీ రామానుజం, సీఐ మోహన్‌బాబు, ఎంపీడీఓ జయరాం, ఎంఈఓ బి.రాములు పరిశీలించారు.

200 వాహనాలు సీజ్



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ సారంగపాణి

ఖమ్మంక్రైం: రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న 200 వాహనాలను సీజ్ చేసి, యజమానులకు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు కూడళ్లలో నాలుగు రోజులుగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో లైసెన్సు, నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలు సీజ్ చేశామని వెల్లడించారు. ఈమేరకు మంగళవారం వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, నంబర్ ప్లేట్ తీసుకొచ్చిన యజమానులకు వాహనాలను తిరిగి అప్పగించినట్లు తెలిపారు. కాగా, ఎక్కువ శబ్దం వచ్చేలా సైలెన్సర్లు మార్చిన వాహనదారులపై కూడా దృష్టి సారించి, సైలెన్సర్లు మార్చే మెకానిక్‌లను కౌన్సెలింగ్ ఇచ్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ అశోక్ , ఎస్సై రవి పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య భూపంచాయితీ

నేలకొండపల్లి: భూతగాదా నేపథ్యాన ఇరువర్గాలు గొడవకు దిగగా ఓ వర్గానికి చెందిన వ్యక్తి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. మండలంలోని అజయ్‌తండాలో కొంత కాలం నుంచి భూపంచాయితీ నడుస్తుంది. ఇందులో ఓ వర్గానికి చెందిన భానుప్రసాద్ రిజిస్ట్రేషన్ ఉందని చెబుతూ పొలంలో కోళ్ల ఫాం నిర్మిస్తుండగా, నిర్మాణం చేపడుతున్న స్థలం తమదని రామారావు వాదిస్తుండడంతో ఘర్షణ తారాస్థాయికి చేరింది. ఈ నేపథ్యాన తేజావత్ సైదులు బైక్‌ను వివాదాస్పదస్థలం వద్ద నిలపగా గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఈమేరకు బాధితుడి ఫిర్యాదుతో ఎస్సై బి.సతీష్ పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

క్లుప్తంగా...



169 మందికి తహసీల్దార్లుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో నాయబ్ తహసీల్దార్లుగా పనిచేస్తున్న 169 మందికి తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్‌మిత్తల్ అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన శాఖా పదోన్నతుల కమిటీ (డీపీసీ)లో నిర్ణయం తీసుకున్నారు. 2016–17 ప్యానెల్ సంవత్సరానికి సంబంధించిన పదోన్నతులకు ఈ కమిటీ ఆమోద ముద్ర వేసింది. కాగా పదోన్నతులు కల్పించడం పట్ల తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్ రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు మన్నె ప్రభాకర్, ఉపాధ్యక్షులు కె.నిరంజన్, రమేష్ పాక తదితరులు మిత్తల్‌ను సచివాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

'అజయ్ టు యోగి ఆదిత్యనాథ్' పుస్తకావిష్కరణ




సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లో ప్రాచుర్యం పొందిన బొమ్మల కథ 'అజయ్ టు యోగి ఆదిత్యనాథ్'పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న ఇంజనీర్స్ ఇండియా భవనంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, రాజ్యసభ సభ్యుడు జాఫర్ ఇస్లాం, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షాజియా ఇల్మీ, చిలుకూరు బాలాజీ దేవాలయ పూజారి సీఎస్ రంగరాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ జీవిత చరిత్రపై గతంలో ప్రముఖ రచయిత శంతను గుప్తా 'ది మాంక్ హూ బికేమ్ చీఫ్ మినిస్టర్', 'ది మాంక్ హూ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఉత్తరప్రదేశ్'అనే రెండు బెస్ట్ సెల్లింగ్ నవలలు రాశారు. ఈ సందర్భంగా రచయిత విలేకరులతో మాట్లాడుతూ 'ఆరుగురు తోబుట్టువులతో జన్మించిన అజయ్ సింగ్ బిష్త్ అనే కుర్రాడు.. అజయ్ గోరఖ్‌నాథ్ మఠానికి చెందిన మహంత్‌గా, తర్వాత పార్లమెంటులో అతిపిన్న వయస్కుడైన సభ్యుడిగా, చివరికి యూపీ సీఎంగా ఎలా ఎదిగాడు అనేదే ఈ పుస్తకం'అని తెలిపారు.

ఆదుకోవడం అంటే ఇలా..

లంక గ్రామాల వరద బాధితులతో ఏపీ సీఎం వైఎస్ జగన్

- నాడు ఫొటో సెషన్‌లా నేతల పర్యటన
- బాధితుల వద్దకు నేరుగా వెళ్లి మాట్లాడేవారు కాదు
- నేడు తక్షణ సాయం అందించాకే జనం మధ్యకు వస్తున్నా



అంబేడ్కర్ కోనసీమ జిల్లా గురజాపు లంకలో వరద తాకిడికి గురైన ఓ ఇంట్లోకి వెళ్లి పరిశీలించి.. బాధితురాలికి భరోసా ఇస్తున్న ఏపీ సీఎం జగన్

సాక్షి అమలాపురం: 'గతంలో చాలాసార్లు వరదలు వచ్చాయి. నాయకులు అప్పటికప్పుడు రావడం, అధికారులంతా వారి చుట్టూ తిరగటం జరిగేది. పేపర్లలో.. టీవీల్లో ఫొటోల కోసం పోజులిచ్చి వెళ్లిపోయేవారు. ప్రతి ఒక్కరికీ మంచి జరగాలి. కానీ వారు మంచి జరిగిందా లేదా అని చూడలేదు. మన ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని మార్చాం. ప్రతి బాధితునికి సాయం అందుతోంది. నాలుగేళ్లుగా ఈ మార్పు కనిపిస్తోంది. సాయం చేయడం, ఆదుకోవడం అంటే ఇదీ..'అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గోదావరి వరదల బారిన పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం ఆయన పర్యటించారు. ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని గురజాపులంక, లంకాఫ్ ఠాన్నేల్లంక, కొండుకుదురులంకల్లో బాధితులతో మమేకమయ్యారు. వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇలాంటి ప్రతి సందర్భంలో కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజలకు తక్షణ సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు కావాల్సిన డబ్బులు వారి చేతుల్లో పెట్టామని చెప్పారు. వరద నష్టం ఎక్కువా, తక్కువా అని చూడకుండా బాధితులను ఉదారంగా ఆదుకోండని చెప్పామని తెలిపారు. 'ఆయా జిల్లాల్లో కలెక్టర్లకు వారం రోజుల సమయం ఇచ్చాం. ప్రతి గ్రామంలోకి వెళ్లాలని, ప్రతి గ్రామంలో ఉన్న వ్యవస్థను చైతన్యం చేయాలని చెప్పాం. ఆ తర్వాత నేను స్వయంగా వచ్చి బాధితులకు సాయం అందిందీ లేనిదీ చూస్తానని చెప్పాను. నేను వచ్చినప్పుడు నాకు సహాయం అందలేదని ఏ ఒక్కరి నోటి నుంచి రాకూడదు'అని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని చెప్పారు. వరదలు వచ్చినప్పుడే మిమ్మల్ని పలకరించేందుకు వస్తే సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందని భావించే ఇలా చేశానని వివరించారు. కష్టాలలో ఉన్నప్పుడు మీ బిడ్డ వేగంగా ఆదుకుంటాడని పునరుద్ఘాటించారు.

నేరుగా జనం మధ్యకే..

మంగళవారం ఉదయం సీఎం వైఎస్ జగన్ నేరుగా గురజాపులంకకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. ఇలా గోదావరి మధ్యన ఉన్న లంక గ్రామాలకు నేరుగా వచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ కావడం విశేషం. సాధారణంగా వరదల సమయంలో బాధితులను పరామర్శించేందుకు గతంలో చాలా మంది ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు జిల్లాకు వచ్చారు. అప్పట్లో డివిజన్ కేంద్రమైన అమలాపురం, వరద ప్రభావిత ప్రాంతాల మండల కేంద్రాలలో వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ఎంపిక చేసిన బాధితులను పరామర్శించి వెనుదిరిగేవారు. సీఎం జగన్ ఇందుకు భిన్నంగా నేరుగా లంక గ్రామాలలోనే దిగడం.. బాధితులను, పంట నష్టపోయిన రైతులను పరామర్శించడంతోపాటు జరిగిన నష్టాన్ని స్వయంగా వీక్షించడం గమనార్హం. ఐదారు గంటలపాటు లంక వాసులతో సీఎం మమేకమయ్యారు.

వరదలొస్తే ఏం చేయాలి?

- ఒడిశా, యూపీ, అసోం విధానాల అధ్యయనానికి టెక్నికల్ కమిటీ
- గంగా, బ్రహ్మపుత్ర, మహానది నదుల వరద నివారణ చర్యల పరిశీలన
- కమిటీ నివేదిక ఆధారంగా గోదావరి వరదలపై సర్కారు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గోదావరి వరదల నుంచి భద్రాచలం పట్టణం, పరిసర గ్రామాలకు రక్షణ కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహానది, గంగా, బ్రహ్మపుత్ర నదుల వరదల నుంచి లోతట్టు ప్రాంతాలకు రక్షణ కల్పించేందుకు అక్కడ అవలంబిస్తున్న అత్యుత్తమ విధానాలపై అధ్యయనం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఈ నెల 16 నుంచి 18 వరకు ఒడిశాలోని మహానది, 20 నుంచి 22 వరకు అస్సాంలోని బ్రహ్మపుత్ర, 29–31 వరకు ఉత్తరప్రదేశ్‌లోని గంగా నదిని సందర్శించి వరద రక్షణ చర్యలను పరిశీలించనుంది. ప్రధానంగా వరద రక్షణ గోడలు నిర్మించాలా? లేక ఇంకేమైనా ప్రత్యామ్నాయాలు ఉన్నాయా? అన్న అంశంపై దృష్టి పెట్టనుంది. వరద రక్షణ గోడల వల్ల ఫలితాలతోపాటు వచ్చే సమస్యలను సైతం కమిటీ అధ్యయనం చేయనుంది. గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో రెండు వైపులా గోడలు నిర్మించి స్థానికులకు రక్షణ కల్పించాలని గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. భద్రాచలం ఆలయం, పర్ణశాల, మణుగూరు భారజల ప్లాంట్ వంటి ముఖ్యమైన కట్టడాలకు మాత్రమే వరద రక్షణ గోడలు నిర్మించాలని, మిగిలిన ముంపు ప్రాంతాల్లోని ఆవాసాలు, గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వరద రక్షణ గోడలకు ప్రత్యామ్నాయంగా ఇతర రాష్ట్రాలు తీసుకున్న చర్యలను టెక్నికల్ కమిటీ పరిశీలించనుంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా భద్రాచలం వరద రక్షణ గోడల ప్రాజెక్టుపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

వరదల్లో 49 మంది మృతి

హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం మరో నివేదిక

సాక్షి, హైదరాబాద్: పది రోజుల క్రితం కురిసిన వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో 49 మంది మరణించినట్లు ప్రభుత్వం హైకోర్టుకు నివేదిక సమర్పించింది. ఇందులో నలుగురు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మరణించారని పేర్కొంది. గత వారంలో ఒక నివేదిక అందజేయగా, ఇప్పుడు మరో నివేదిక అందజేసింది. 'మృతుల కుటుంబానికి రూ.4 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాం. వరదసాయానికి రూ.500 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వరద తీవ్రత ఎక్కువ ఉన్నందున రెండు హెలికాప్టర్లు, 27 పడవల్ని అందుబాటులో ఉంచాం. 655 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం. 177 షెల్టర్లు ఏర్పాటు చేసి 12 వేలమందికి ఆశ్రయం కల్పించాం. 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, రెండు హెలికాప్టర్లు, రాష్ట్ర అగ్నిమాపక, విపత్తుల శాఖలు వరద బాధితులకు అండగా నిలిచాయి. మొత్తం 548 రోడ్లు దెబ్బతినగా.. వీటిలో 471 రాష్ట్ర రహదారులుండగా, 181 రోడ్లకు మరమ్మతులు జరిగాయి. 774 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వచ్చింది. 721 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ చేశాం. రోడ్ల మరమ్మతులు, విద్యుత్ వంటివాటిని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నాం'అని రాష్ట్ర విపత్తుల కమిషనర్ బొజ్జా రాహుల్ హైకోర్టుకు తెలియజేశారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ 2020లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ మధ్యంతర అప్లికేషన్(ఐఏ) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఐఏపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

మూలధన వ్యయంలో అగ్రభాగాన ఏపీ

ఆస్తుల కల్పన వ్యయంలో అగ్రపథంలో ఆంధ్రప్రదేశ్.. 3 నెలల్లో 40 శాతం వ్యయం



సాక్షి, అమరావతి: ఆస్తుల కల్పనకు ఉద్దేశించిన మూలధనం వ్యయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూలధన వ్యయంపై కాగ్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. బడ్జెట్‌లో మూలధన వ్యయం కేటాయింపుల్లో తొలి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 40.79 శాతం వ్యయం చేసినట్లు కాగ్ గణాంకాలు తెలిపాయి. దేశంలో మరే రాష్ట్రంలోనూ తొలి త్రైమాసికంలో ఇంత మేర వ్యయం చేయలేదని కాగ్ గణాంకాలు పేర్కొన్నాయి. పలు రాష్ట్రాలు బడ్జెట్‌లో మూలధన వ్యయం కేటాయింపుల్లో ఎంతమేర ఖర్చు చేశాయనే అంశాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక కూడా వెల్లడించింది. మూలధన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ చేసినంత వ్యయం దేశంలో మరే రాష్ట్రంలోనూ చేయలేదని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. బడ్జెట్‌లో మూలధన వ్యయానికి చేసిన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్, మే నెలల్లోనే ఏకంగా 29.70 శాతం వ్యయం చేసిందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికానికి సంబంధించి కాగ్ గణాంకాలు కూడా మూలధన వ్యయంలో ఆంధ్రప్రదేశ్ మిగతా రాష్ట్రాల కన్నా ముందంజలో ఉన్నట్లు వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మూలధన వ్యయం కింద రూ.31,061 కోట్లు కేటాయింపులు చేయగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు రూ.12,669 కోట్లు వ్యయం చేసిందని, ఇది కేటాయింపుల్లో 40.79 శాతమని కాగ్ గణాంకాలు స్పష్టం చేశాయి. ఆంధ్రప్రదేశ్ తరువాత మూలధన కేటాయింపుల్లో ఎక్కువ వ్యయం చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, మహారాష్ట్ర ఉన్నాయి. మూలధన వ్యయం అంటే నేరుగా ఆస్తుల కల్పన వ్యయంగా పరిగణిస్తారు.

బధిరులకు డిగ్రీ కాలేజీ ఏర్పాటు యోచన

వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో బధిర విద్యార్థులకు ప్రత్యేకంగా డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశించారని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం మలక్‌పేట్‌లోని తన కార్యాలయంలో ఖైరతాబాద్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేందర్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. బధిరుల డిగ్రీ కాలేజీ ఏర్పాటుతోపాటు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ...డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం పరిశీలన బృందం చేసిన ప్రతిపాదనలపై వీలైనంత త్వరగా నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రాష్ట్రంలో బధిరులకు కళాశాల లేనందున వారు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బధిర విద్యార్థుల కళాశాల ఏర్పాటు కోసం గతంలో సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందించామని, దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మొబైల్ ఫోన్ రికవరీలో తెలంగాణ టాప్

సాక్షి, హైదరాబాద్ : చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల జాడ కనిపెట్టడంలో దేశంలోనే తెలంగాణ పోలీసు నంబర్‌వన్‌గా నిలిచారు. మొత్తం 67.98% రికవరీతో మొబైల్‌ఫోన్ల జాడను కనిపెట్టి వాటిని సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్‌ఫోన్లను రికవరీ చేసేందుకు టెలికమ్యూనికేషన్స్ విభాగం రూపొందించిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీస్‌శాఖలు వినియోగిస్తున్నాయని, ఈ పోర్టల్‌ను ఉపయోగించి మొబైల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ పోలీస్ విభాగం తొలిస్థానంలో నిలిచిందని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20 నుంచి ఆగస్టు 07 వరకు మొబైల్ ఫోన్ల చోరీ, పోగొట్టుకోవడంపై తెలంగాణ పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు 5,038 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ తర్వాత కర్ణాటక 54.20% రెండో స్థానంలో, 50.90%తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నిలిచినట్లు మహేశ్ భగవత్ పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

17నుంచి శ్రావణ మాసోత్సవం

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో ఈనెల 17నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవ పూజలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 17వ తేదీన శ్రావణ మాస దీక్ష ప్రారంభం కానుండగా, ప్రత్యేక పూజలు, వ్రతాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈమేరకు భక్తులు పెద్దసంఖ్యలో పూజలకు హాజరుకావాలని ఈఓ కోరారు.

డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. ఫిజికల్ సైన్స్(ఎంపీసీ, ఎంపీసీఎస్, డేటా సైన్స్), లైఫ్ సైన్సెస్(బీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, బీజెడ్‌సీఎస్), బీకాం(సీఏ) బీకాం(జనరల్), బీఏ(సీబీసీఎస్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థినులు ధ్రువీకరణ పత్రాలు, రూ.200 ఫీజుతో ఈనెల 20లోగా కళాశాలలో నేరుగా సంప్రదించాలని సూచించారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌నాయక్

టేకులపల్లి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. టేకులపల్లి హైస్కూల్‌లో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ శిబిరంలో మంగళవారం పాల్గొన్న ఆయన ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయులకు సంబంధించి ఏహెచ్ఆర్ఏ జీఓ విడుదల చేయాలని, పీఆర్‌సీ నియమించి ఐఆర్‌ను ప్రకటించడమే కాక సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఈమేరకు డిమాండ్లతో 12వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న ధర్నాకు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈసమావేశంలో టీఎస్‌టీటీఎఫ్ నాయకులు హత్తీరాం, వాంకుడోత్ రమేష్‌బాబు, బన్సీలాల్, పూల్సింగ్, గోరియా, బాలాజీ పాల్గొన్నారు.

అపరాలకు ఆమడదూరంలో...

- గణనీయంగా తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- లక్ష్యంలో నగం మేర పడిపోయిన పెసర సాగు
- మొత్తానికే కనుమరుగవుతున్న కంది సాగు
- వాణిజ్య పంటల వైపే రైతుల మొగ్గు



మున్నేరు వరదతో ఖమ్మం రూరల్ మండలంలో దెబ్బతిన్న పెసర పైరు

ఖమ్మంవ్యవసాయం: రైతులు అపరాల పంటలు సాగుకు దూరమవుతున్నారు. అనుకూలించని వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు ఇందుకు ఓ కారణంగా కాగా, వాణిజ్య పంటలకు పెరిగిన ప్రాధాన్యత ఇంకో కారణంగా చెబుతున్నారు. ఇలా కారణాలు ఏమైనా అపరాల పంటల సాగు విస్తీర్ణం మాత్రం ఏటేటా గణనీయంగా పడిపోతోంది. వ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న మార్పులు, నీటి వనరులు అందుబాటులోకి రావడంతో అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగుకే మొగ్గుచూపుతున్నారు. అపరాల పంటల్లో ప్రధానమైనవి పెసర, కంది. ఇందులో కాల పరిమితి ఎక్కువగా ఉండటంతో కంది పంట క్రమక్రమంగా కనుమరుగవుతోంది. ఇక తక్కువ కాల పరిమితి కలిగిన పెసర సాగుపై రైతులు ఆసక్తి కనబరచటం లేదు. రెండేళ్లుగా పెసర పంట చేతికందే సమయాన అధిక వర్షాలతో నష్టం ఎదురైంది. దీంతో ప్రభుత్వం అపరాల పంటలు సాగు చేయాలని సూచిస్తున్నా... పత్తి, మిర్చి, ఇతర ఉద్యాన పంటలకే ప్రాధాన్యమిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలోని కొన్ని మండలాల్లో గత మూడేళ్లలో పెసర సాగు (ఎకరాల్లో)

మండలం	2021	2022	2023
కామేపల్లి	100	13	31
రఘునాథపాలెం	1,209	222	153
కూసుమంచి	554	176	01
నేలకొండపల్లి	252	46	21
తిరుమలాయపాలెం	1,516	344	87
చింతకాని	5,555	2,007	2,702
కల్లూరు	108	20	14
పెనుబల్లి	9	20	00
ఏన్కూరు	60	67	16
వైరా	1,380	911	284

లక్ష్యానికి దూరంలో...

ప్రస్తుత వానాకాలం ఖమ్మం జిల్లాలో అపరాల పంటల సాగు గణనీయంగా తగ్గింది. జిల్లాలో పెసర 21 వేల ఎకరాల్లో సాగవుతుండగా అధికారులు అంచనా వేస్తే 10,125 ఎకరాల్లోనే సాగైంది. పెసర పంట కాలం రకాల ఆధారంగా 70 రోజుల వరకు ఉంటుంది. జూన్ ఆరంభంలో పంట వేస్తే ఆగస్టులో చేతికందుతుంది. కానీ ఆగస్టులో కురుస్తున్న వర్షాలతో పంట దెబ్బ తింటోంది. 2020 సంవత్సరంలో 24,664 ఎకరాల్లో, 2021లో 18,156 ఎకరాల్లో 2022లో 6,869 ఎకరాల్లో సాగు చేసిన పెసర పంట వానలకు దెబ్బతినగా రైతులు నష్టపోయారు. ఇక ఈ ఏడాది జూన్‌లో వర్షాలు లేకపోవటంతో లక్ష్యం మేర పెసర సాగుకు నోచుకోలేదు. కంది పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. పంట సాగు కాలం ఎక్కువ కావటం ఓ కారణం కాగా, ఆశించిన ఆదాయం లేకపోవటంతో రైతులు ఆదరించటం లేదు. 2020లో కంది సాగు విస్తీర్ణం 5,344 ఎకరాలు కాగా 2021లో 2,933, 2022లో 232 ఎకరాల్లో సాగు చేశారు. ఇక ఈసారి కేవలం 211 ఎకరాలకే పరిమితం కావడం గమనార్హం.

మద్దతు ధర ఉన్నా...

పప్పు పంటలకు ఉన్న డిమాండ్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అపరాల పంటలు సాగు చేయాలని అవగాహన కల్పిస్తోంది. పప్పులకు మార్కెట్‌లో ధర కూడా బాగానే పలుకుతోంది. పెసలు, కందులకు ప్రభుత్వం మద్దతు ధర ఆశించిన రీతిలో ప్రకటించింది. పెసర ధర గత ఏడాది రూ. 7,755 కాగా ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.8,558గా నిర్ణయించింది. కందుల ధర రూ.6,600గా ఉండగా, ఈ ఏడాది మరింత పెరిగింది. అయితే, జిల్లాలో నీటి వనరులు పెరగటంతో అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మిర్చి, ఇతర వాణిజ్య పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుకు రైతులు ప్రాధాన్యమిస్తున్నారు. కంది పంట సాగు కాలం దాదాపు ఆరు నెలలుగా ఉండగా.. ఎకరాకు నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రాదు. అంటే ఎకరాకు రూ. 20 నుంచి రూ. 25 వేలకు మించి ఆదాయం రావటం లేదు. ఇదే స్థానంలో మిర్చి వంటి పంటలు సాగు చేస్తే ధర ఆధారంగా కనీసం రూ.1.80 లక్ష వరకు ఆదాయం సమకూరుతుండడంతో రైతులు అటే మొగ్గు చూపుతున్నారు.

ఎలాంటి ప్రయోజనమూ లేదు..



అపరాల సాగుతో ఎంతమాత్రం ప్రయోజనం లేదు. గత ఏడాది రెండెకరాల్లో పెసర సాగుచేస్తే అధిక వర్షాలతో చేతికందకుండా పోయింది. కనీసం పెట్టుబడి కూడా రాలేదు. దీంతో ఈ ఏడాది పెసర సాగు చేయలేదు. అయినా ఈసారి సరైన సమయానికి వానలు కూడా కురవలేదు.

– బానోత్ రామా, బీచురాజుపల్లి తండా, తిరుమలాయపాలెం మండలం

వర్షాభావమూ ఓ కారణమే..



నీటి వనరులు పెరిగిన నేపథ్యాన అపరాలకు బదులు మిర్చి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. అధిక ఆదాయాన్నిచ్చే వాణిజ్య పంటల వైపునకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది సమయానికి వానలు కురవక కూడా అపరాల పంటల సాగుకు ప్రాధాన్యం తగ్గింది.

– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి, ఖమ్మం

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్
- పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై చర్యలకు ఆదేశం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంఅర్బన్: గిరిజన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరేలా మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల, వసతి గృహాల హెచ్‌ఎంలు, వార్డెన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి ఉత్తమ ఫలితాలు రావాలంటే చివరలో దృష్టి సారించడం కాకుండా ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

బదిలీ, బాధ్యతల నుంచి తొలగింపు

గత ఏడాది పదో తరగతి ఫలితాలు తక్కువగా నమోదైన పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై చర్యలకు పీఓ ప్రతీక్ ఆదేశించారు. ఖమ్మం ఏహెచ్ఎస్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులను గుండాల ఆశ్రమ పాఠశాలకు బదిలీ చేయడమే కాక ఏసీబీ హెచ్ వార్డెన్, పీపీ ప్రాజెక్ట్ హెచ్‌ఎం రాంబాబును చర్లకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే, పాఠశాలల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన ఖమ్మం ఏసీఎంఓ రాములను ఆ హోదా నుంచి తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ(జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, అధికారులు కృష్ణానాయక్, తానాజీ, రమణయ్య, రాములు, నరసింగరావు, తిరుమలరావు, రూపాదేవి, చంద్రమోహన్, అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి హాజరుకండి

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం బుధవారం జరగనుండగా కార్యక్రమానికి హాజరుకావాలని పీఓ ప్రతీక్‌జైన్, ఏపీఓ డేవిడ్‌రాజ్‌ను భద్రాద్రి ఆదివాసీ సమితి అధ్యక్షుడు పూణెం కృష్ణ, ప్రధాన కార్యదర్శి పాయం రవివర్మ కోరారు. ఈమేరకు నాయకులు కొండూరు సుధారాణి, కన్న రాజుతో కలిసి వారు పీఓ, ఏపీఓకు ఆహ్వానపత్రికలు అందజేశారు.

గహలక్ష్మి దరఖాస్తు గడువు పొడిగించాలి

- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: గృహలక్ష్మి పథకం కింద స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు రూ.3లక్షల ఆర్థికసాయం ఇస్తామని ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం దరఖాస్తుకు మాత్రం మూడు రోజుల గడువు ఇవ్వడం సరికాదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. మూడు రోజుల్లో ధృవీకరణ పత్రాలు తీసుకోవడం సాధ్యం కాదని చెప్పారు. ఈమేరకు మరో ఇరవై రోజుల పాటు గడువు పొడిగించడంతో పాటు దరఖాస్తులు స్వీకరించే సమయాన రశీదు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, లేనిపక్షంలో పోరాటలు చేస్తామని రంగారావు ఓ ప్రకటనలో హెచ్చరించారు.

సంస్థ అభివృద్ధికి పాటుపడాలి



నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగం సాధించిన వారు నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య సూచించారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు మంగళవారం ఆయన ఉద్యోగ నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. సింగరేణిలో ఉద్యోగం సాధించడాన్ని అదృష్టంగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు కె.శ్రీనివాస్‌రావు, సుశీల్‌కుమార్, వరప్రసాద్, అజీజ్, స్వప్ననీల్, సింధుశ్రీ పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ: సైబర్ మోసగాళ్ల విషయంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఏ.గోపాల్‌రావు ఒక ప్రకటనలో సూచించారు. వినియోగదారులకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి విద్యుత్ బిల్లు కట్టనందున సరఫరా నిలిపేస్తామని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అయితే, ఎన్పీడీసీఎల్ నుంచి సిబ్బంది ఎవరు కూడా ఫోన్ చేయరని, మెసేజ్ పంపించరని స్పష్టం చేశారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌ల్లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని తెలిపారు. అలాగే, బ్యాంకు ఖాతా, ఆధార్, పాన్, డెబిట్, క్రెడిట్ కార్డుల అపరిచితులకు చెప్పకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఎండీ సూచించారు.